క్లుప్తంగా

సర్వే పనులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న డీఈ శేషాద్రి

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక కట్టమంచి సెక్షన్ నుంచి దొడ్డిపల్లె సెక్షన్‌కు ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు సర్వే పనులు సోమవారం ప్రారంభించారు. ప్రస్తుతం కట్టమంచి ప్రాంతానికి గిరింపేట నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. లైన్ మెయింటెనెన్స్ తీసుకోవాలంటే గిరింపేట సబ్ స్టేషన్ సరఫరా ఆపి తీసుకోవాల్సి వస్తుంది. అలా కాకుండా దొడ్డిపల్లె నుంచి ప్రత్యామ్నాయంగా లైన్ వేస్తే గిరింపేట నుంచి మెయిన్ సరఫరా వస్తుంది. లైన్ మెయింటెనెన్స్ లేదా ఇతర ఇబ్బందులు వచ్చినప్పుడు దొడ్డిపల్లె నుంచి ప్రత్యామ్నాయంగా సరఫరా తీసుకోవచ్చు. సర్వే పనులను డీఈ శేషాద్రి, ఏఈలు మహమ్మద్‌బాషా, సుధాకర్ పరిశీలించారు. దాదాపు 33 కేవీ లైన్ 5 కిలోమీటర్లు అవసరమని, 12 మీటర్ల పోల్స్ 100 పడుతాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

కల్లూరుపల్లెలో అటల్ బుజల్ యోజన టీం



కల్లూరుపల్లెలో జీవన ఎరువుల తయారీని పరిశీలిస్తున్న రాజస్తాన్ బృందం

బంగారుపాళెం: మండలంలోని కల్లూరుపల్లెను సోమవారం సాయంత్రం అటల్ బుజల్ యోజన (రాజస్తాన్) టీం సభ్యులు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తెలుసుకునేందుకు అధికారులతో పాటు రైతులు విచ్చేశారు. గ్రామంలో రైతులు సాగుచేస్తున్న వివిధ పంటలను పరిశీలించారు. స్టేట్ రిసోర్సు పర్సన్ సురేంద్రరెడ్డి, ఎన్ఆర్‌టీ కల్పన, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆ బృందానికి వివరించారు. తొలుత ప్రకృతి వ్యవసాయం పద్ధతులను తెలిపే చక్రం వేసి డెమో ద్వారా వివరించారు. భీజామృతం, ఘన, ద్రవ జీవామృతాలు, పెల్లటైజేషన్ విత్తన గుళికలు తయారు చేసే విధానన్ని డెమో ద్వారా అవగాహన కలిపించారు. వేరుశనగకు బదులుగా ప్రత్యామ్నాయంగా 18 పంటల సాగు గురించి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రగతి గురించి ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులతో మాట్లాడారు.

రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోండి

బంగారుపాళెం: రైతులు రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి సాగరిక సోమవారం తెలిపారు. తీగ జాతి కూరగాయలైన కాకర, బీర పంటలు, టమాటా పంటను పందిరి విధానంలో(కట్టెలు, దారాలతో) సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.7.500, కూరగాయలు మల్చింగ్ పద్ధతి(ప్లాస్టిక్ కవర్లు భూమిపై పరచి సాగు) ద్వారా సాగుచేసే రైతులకు ఎకరాకు రూ 6.400 ఉద్యానశాఖ రాయితీ అందిస్తోందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో పొలం పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్సు పత్రాలు, రైతు పొలంలో తీసుకున్న ఫొటో ఇవ్వాలన్నారు. అలాగే కూరగాయల నారు బిల్లు, ప్లాస్టిక్ కవర్లకు సంబంధించిన బిల్లు సమర్పించాలన్నారు. కూరగాయలు సాగుచేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమష్టి కృషితో కుష్టు నివారణ



కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ఐరాల: సమష్టి కృషితో కుష్టువ్యాధిపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించి, నివారిద్దామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని పాలకలలో వైద్య సిబ్బంది కుష్టువ్యాధిపై ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని పీహెచ్‌సీ పరిధిలో వైద్యసిబ్బంది చేపడుతున్నారన్నారు. కుష్టువ్యాధిని ప్రారంభం దశలోనే గుర్తించి సకాలంలో ఎండీటీ చికిత్స అందజేయడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. గ్రామీణా ప్రాంతాల్లో వైద్యసిబ్బంది కుష్టువ్యాధి లక్షణాలను తెలుసుకుని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పుట్టుకతోనే ఉన్న మచ్చలు, వచ్చిపోయే మచ్చలు, పూర్తిగా తెల్లని మచ్చలు, దురద పెట్టే మచ్చల వల్ల అపోహలు పడరాదని సూచించారు. కుష్టు వ్యాధి సూక్ష్మక్రిముల ద్వారా వస్తుందని తెలిపారు. చిన్న పిల్లలుగా ఉన్నప్పటి నుంచే ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

లంపి.. పశువులను చంపి

- పాడి పశువులకు ప్రాణాంతకంగా లంపి చర్మవ్యాధి
- నివారణకు ముందస్తు టీకాలు తప్పనిసరి
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యాధికారులు



గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

చిత్తూరు అగ్రికల్చర్: రైతులు అత్యధికంగా పాడి పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పశువుల యాజమాన్యంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నా పలు రకాల వ్యాధులు పశువులకు సోకుతున్నాయి. దీంతో రైతులు వ్యాధి నివారణలో కొంత అశ్రద్ధ చేసినా పశువును కోల్పోవాల్సిన దుస్థితి. ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు పశువైద్యాధికారులు ముందస్తుగానే వ్యాధి నివారణ టీకాలను వేసే కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాంటి వ్యాధుల్లో ప్రస్తుతం లంపి స్కిన్ (ముద్ద చర్మ) వ్యాధి సోకకుండా పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వ్యాధి సోకడం ఇలా..

లంపి స్కిన్ వ్యాధి ఆవులు, ఎద్దుల లాంటి జంతువులకు సోకుతుంది. ఈ వ్యాధి పశువులను ప్రభావితం చేసే వైరల్ వ్యాధి. ఇది రక్తాన్ని పీల్చే దోమలు, ఈగలు, పేలు వంటి కీటకాలు కుట్టడం ద్వారా ఒక జంతువు నుంచి మరో జంతువుకు సంక్రమిస్తుంది. ఈ వ్యాధి సోకిన జంతువుతో మరొక జంతువుతో సన్నిహితంగా ఉంటే వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పశువులకు జ్వరం రావడంతో చర్మంపై గడ్డల్లా వస్తాయి. వ్యాధి బారిన పడిన పశువులు మరణించే ప్రమాదం ఉంది. ఇది పోక్స్‌విరిడే కుటుంబానికి చెందిన వైరస్, కాప్రిపాక్స్ వైరస్ జాతికి చెందినదని ప్రపంచ జంతు ఆరోగ్య సంస్థ (డబ్ల్యూఓఏహెచ్)తెలిపింది.

వ్యాధి ప్రధాన లక్షణాలు..

- తెల్లజాతి పశువులలో అధికంగా వ్యాధి వ్యాపిస్తుంది
- వ్యాధి సోకిన పశువులకు చర్మంపై పొక్కులు రావడం
- పశువు శరీరమంతా 2 నుంచి 5 సెం.మీ.ల పరిమాణంలో కణితులు ఏర్పడడం
- 2 నుంచి 3 రోజుల పాటు జ్వరం ఉంటుంది.
- అవయవాలతో పాటు జననేంద్రియాల వాపు రావడం(గంగడోలు వాపు కనిపిస్తుంది)
- కళ్లలో నీరు కారడం.. రినైటిస్ వ్యాధి రావడం
- లాలాజల స్రావాలు పెరగడం
- పశువు నీరసించి పాల దిగుబడి తగ్గుతుంది
- తర్వాతి దశలో కాళ్ల నొప్పుల కారణంగా పశువు సరిగా నడవలేకపోవడం

నివారణా చర్యలు ఇవీ..

- వ్యాధి సోకిన పశువును మంద నుంచి వేరు చేసి పశువైద్యుడి సూచనల మేరకు తగిన చికిత్స అందించాలి
- ఈగలు, దోమలు, గోమార్లు, ఇతర కీటకాలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలి
- ఆరోగ్యంగా ఉన్న పశువులకు ముద్ద చర్మ వ్యాధి నిరోధక (గోట్ పాక్స్) టీకాలు వేయించాలి

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



పశువులకు ముద్ద చర్మ వ్యాధి సోకకుండా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. ఇందుకోసం ఆయా గ్రామాల పరిధిలోనే పశువైద్యాధికారుల ఆధ్వర్యంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. కావున ప్రతి రైతు తమ పశువులకు టీకాలు వేయించుకోలి. వ్యాధి పట్ల ఏదైనా అనుమానాలు ఉంటే సమీప పశువైద్యాధికారిని సంప్రదించాలి. లేదా 1962కి కాల్ చేయాలి

– డాక్టర్ ప్రభాకర్, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ

ప్రజల ముంగిటకే ప్రభుత్వ వైద్యం



గుడిపాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూష



వృద్ధులకు వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందు తోందని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ అనూష అన్నారు. శ్రీరంగంపల్లె గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం

తవణంపల్లె: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. సోమవారం మండలంలోని దిగువమోదాలపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. పీహెచ్‌సీలో కూడా ప్రసవాలు చేస్తున్నట్లు వివరించారు. 104, 108 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ పావని, డీఈఓ విజయకుమారి, ఆశా కార్యకర్త సౌందర్య పాల్గొన్నారు.

వరసిద్ధునికి వెండి పాత్రల విరాళం



వెండి పాత్రలు అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధివినాయక స్వామి దేవస్థానానికి సోమవారం కృష్ణపట్నం పోర్ట్ సీఈవో జగన్నాథరావు వెండిపాత్రలు విరాళంగా అందజేశారు. వెండిదీప స్తంభాలు, వెండి చెంబులు 5, వెండి తట్ట 1, వెండి ప్రసాదం పాత్రలు 2 అందజేశారు. ఇవి మొత్తం 10కిలోలు ఉండగా రూ.10 లక్షలు విలువచేస్తాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు. అనంతరం వారికి దర్శనభాగ్యం కల్పించి వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సిబ్బంది కోదండపాణి తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు మెరుగుపడాలి



పారిశుద్ధ్య పనులు తనిఖీ చేస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పారిశుద్ధ్య పనులు, నీటి సరఫరా జరుగుతున్న తీరును మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ తనిఖీ చేశారు. సోమవారం నగరంలోని తిమ్మసముద్రం, దుర్గా కాలనీ, చవటపల్లె ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్‌కుమార్ నాయక్‌తో కలిసి పర్యవేక్షించారు. పారిశుద్ధ్య పనులు మరింత మెరుగుపడాలని ఆదేశించారు. నగరంలో కలవకుంట రిజర్వాయర్ నుంచి సరఫరా అవుతున్న నీటిని క్లోరినేషన్ చేయడం, పైపులైన్ల లీకేజీని అరికట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. దుర్గానగర్ కాలనీలో గుర్రపుడెక్క మొక్కలను తొలగించాలన్నారు. కమిషనర్ వెంట డీఈ వెంకటప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు ఉన్నారు.

వినతుల స్వీకరణ..

కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఇందులో ప్రజల నుంచి వచ్చిన పది ఫిర్యాదులను కమిషనర్ అరుణ స్వీకరించారు. మెప్మా, పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజినీరింగ్, ప్రజారోగ్యానికి సంబంధించినవి ఉన్నాయి. క్షేత్రస్థాయిలో వీటిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సహాయ కమిషనర్ రామకృష్ణుడు, మున్సిపల్ ఇంజినీరు గోమతి తదితరులు పాల్గొన్నారు.

స్పందన వినతులను పరిష్కరించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

బంగారుపాళెం: ప్రజా సమస్యలపై అధికారులు స్పందించాలని ఎంపీడీఓ శివశంకర్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఆయా శాఖలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే వినతులపై తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత వరకు క్షేత్రస్థాయిలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర రావు, హౌసింగ్ ఏఈ గుణశేఖర్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారి చిట్టిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు



తవణంపల్లెలో కావళ్లు సమర్పించేందుకు వస్తున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని అరగొండలోని శ్రీ స్వయంభువనేశ్వర కుమారస్వామి దేవస్థానంలో సోమవారం ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉభయదారులచే శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం ఉభయదారులచే కామాక్షాంబ, శ్రీ స్వయంభువనేశ్వరస్వామికి, శ్రీ సీతాకోదండ రామ స్వామికి, రుక్మిణీ సత్యభామ సమేత వేణు గోపాలస్వామికి అరగొండ శ్రీ కోదండరామ స్వామి మండపంలో వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అలాగే పలువురు భక్తులు భరణి కావళ్లు చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం ఆడికృత్తిక ఉత్సవాల సందర్భంగా స్వామివారి రాత్రి పుష్ప పల్లకి సేవ అత్యంత వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. తవణంపల్లెలోని సుబ్రమణ్యస్వామి ఆలయంలో భక్తులు రెండురోజుల పాటు కావళ్లు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆడి.. భక్తిశ్రద్ధలతో కావడి



స్వామివారికి కర్పూర హారతులు ఇస్తున్న భక్తులు



మూలస్థానంలోని స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని చెంగల్రాయకొండపై వెలసిన శ్రీ వళ్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవస్థానంలో సోమవారం ఆడి కృత్తిక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున స్వామిని సుప్రభాతసేవలో మేల్కొల్పి ప్రత్యేకంగా అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఉదయం నుంచే స్వామి సేవలో కొలువుదీరారు. కావళ్లతో హరోహర నామస్మరణతో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో సాయంత్రం ఆలయంలో రద్దీ పెరిగిపోయింది. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు.

హరోంహర ..



గుడిపాల: కందగిరికొండ కింద భక్తులకు దర్శనమిస్తున్న వళ్లీ సమేత సుబ్రమణ్యస్వామి

గుడిపాల: మండలవ్యాప్తంగా గ్రామాల్లో హరోహర స్మరణలతో మార్మోగాయి. ఆడికృత్తిక సందర్భంగా సోమవారం ఆడికృత్తిక కావళ్లు కావడంతో ఉదయం నుంచే గ్రామాల్లో సందడి నెలకొంది. ప్రతి గ్రామంలో ఉదయం నుంచి ఉపవాసాలు ఉండి మధ్యాహ్నం హరోహర నామాలతో కావళ్లను ఎత్తుకున్నారు. గ్రామాల్లోని వీధుల వెంబడి నడిచి వస్తూ భక్తులు హరోహర నామం స్మరించారు. మండలంలోని కందగిరికొండ వద్ద వెలసిన సుబ్రమణ్య స్వామి గుడి వద్ద, తమిళనాడులోని వళ్లిమలై, తిరుత్తణిలో భక్తులు వారి మొక్కులను తీర్చుకునేందుకు వెళ్లారు. కందగిరికొండకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే రాత్రి వీధినాటకంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



గుడిపాల: వసంతాపురంలో హరోంహర నామస్మరణతో కావళ్లు మోసుకెళ్తున్న భక్తులు

హెపటైటిస్ లేని సమాజ స్థాపనే లక్ష్యం



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 2030 నాటికి హెపటైటిస్ లేని సమాజ స్థాపనే లక్ష్యమని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన హెపటైటిస్ అవగాహన బ్యానర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెపటైటిస్(కాలేయ) వ్యాధి చాలా ప్రమాదకరమైనదన్నారు. ఈ వ్యాధి లక్షణాలపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. హెపటైటిస్ వ్యాధి శుభ్రతలేని ఆహారం, నీరు, కలుషితమైన రక్తం వల్ల వ్యాపిస్తుందన్నారు. వ్యాధి నియంత్రణలో జిల్లాలోని శిశువులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో హెపటైటిస్–బి వాక్సిన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ వ్యాధి బారినపడకుండా తగు సూచనలను ప్రజలు తప్పక పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డీఐఓ డాక్టర్ హనుమంతరావు, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా–కో ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్ ప్రాణాంతకం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): హెపటైటిస్ ఒక ప్రాణాంతక వైరల్ అంటువ్యాధి అని డీఐఓ హనుమంతరావు అన్నారు. చిత్తూరు నగరంలో సోమవారం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆస్పత్రిలోని సిబ్బంది, గర్భిణులు, రోగులకు అవగాహన కలిపించారు. హెపటైటిస్ ప్రమాదకరమైన కాలేయ సంబంధిత అంటువ్యాధి అన్నారు. శుభ్రతలేని ఆహారం, తాగునీరు, కలుషిత రక్తం ద్వారా వ్యాధి ఇతరులకు సోకుతుందన్నారు. వీటి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. 2030 నాటికి హెపటైటిస్ లేని సమాజ స్థాపనే లక్ష్యమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఉషశ్రీ, రూప, కల్యాణ్, సిబ్బంది పాల్గొన్నారు.